క్లుప్తంగా

కాళీమాత ఆలయంలో ఎమ్మెల్సీ కవిత ప్రత్యేక పూజలు



అమ్మవారికి హారతి ఇస్తున్న ఎమ్మెల్సీ కవిత

శంషాబాద్ రూరల్: మండల పరిధిలోని కవ్వగూడ శివారులో ఉన్న బెంగాలీ స్వర్ణ శిల్పి వివేకానంద కాళీ మాత ఆలయాన్ని ఆదివారం ఎమ్మెల్సీ కవిత దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా కవితను ఆలయ కమిటీ నిర్వాకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఈదమ్మ దేవాలయంలో మారు బోనం



పూజల్లో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: బుద్వేల్ ఈదమ్మ దేవాలయంలో ఆదివారం మారుబోనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి అనంతరం వచ్చే ఆదివారం రోజున ఈదమ్మ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అనంతరం వచ్చే ఆదివారం రోజున మారుబోనం నిర్వహించి అమ్మవారికి భక్తులు వడి బియ్యం సమర్పించిన బియ్యంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు.

మన్ కీ బాత్‌ను తిలకించిన బీజేపీ నాయకులు



మన్ కీ బాత్‌లో పాల్గొన్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ కేశవ్‌నగర్ కాలనీలో దేశ ప్రధాని నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు తిలకించారు. ఈ సందర్భంగా అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్ మాట్లాడుతూ 2023లో మొట్టమొదటి మన్ కీ బాత్ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల పండుగలు, ఆచార వ్యవహారాలు, తదితర అంశాలపై ఆయా రాష్ట్రాల ప్రజలు తమ అభిప్రాయాలను ప్రధానితో పంచుకున్నారన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి సాయి యాదవ్, పుస్తకాల సుదర్శన్, గౌరీ, సుభాష్, చంద్ర, శంకర్, పవన్, నరేష్ పాల్గొన్నారు.

వేణుగోపాలచారికి సన్మానం

రాజేంద్రనగర్: నీటి పారుదల శాఖ చైర్మన్ సముద్రాల వేణుగోపాల చారిని బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్‌లో బ్రాహ్మణ సేవా సమితి జాతీయ అధ్యక్షుడు సుదర్శన్ ప్రసాద్ తివారీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నీటి పారుదల శాఖ చైర్మన్‌గా వేణుగోపాలచారిని నియమించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. ఏప్రిల్ 23న బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి ఐదు లక్షల మందిని సమీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వైభవంగా రంగనాథుడి బ్రహ్మోత్సవాలు

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని చారిత్రక రంగనాథస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవాదాయశాఖ, రంగనాథ మందిర్‌రంగ్ భాగ్ ట్రస్ట్ పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆలయంలో బాలభోగం, అర్చన, బలిహరణ, ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సామూహిక విష్ణు సహస్రనామార్చన చేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో స్వామి వారి పల్లకి సేవా కార్యక్రమాన్ని భక్తుల జయజయధ్వానాల మధ్య ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన చైర్మన్ మేనేజింగ్ ట్రస్టీ శరద్‌బిపిట్టి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె అంజయ్య, ఆలయ అర్చకులు, స్థానికులు పాల్గొన్నారు.

మరింత పటిష్టంగా పోలీసు వ్యవస్థ

- నార్సింగి కేంద్రంగా ఏసీపీ డివిజన్
- రాజేంద్రనగర్ కేంద్రంగా డీసీపీ జోన్
- కొత్తగా మూడు పోలీస్ స్టేషన్లు



నార్సింగి ఏసీపీ జీవీ రమణగౌడ్



నార్సింగి నూతన పోలీస్‌స్టేషన్ భవనం

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పోలీసు వ్యవస్థ మరింత పటిష్టం చేయనున్నారు. ఇప్పటి వరకు మాదాపూర్ జోన్, శంషాబాద్ జోన్ పరిధిలో ఉండగా ప్రస్తుతం రాజేంద్రనగర్ కేంద్రంగా డీసీపీ జోన్ ఏర్పడింది. మాదాపూర్ జోన్‌తో రాజేంద్రనగర్ నియోజకవర్గానికి సంబంధాలు తెగిపోయాయి. ఒకే నియోజకవర్గంలో అటు శంషాబాద్, ఇటు రాజేంద్రనగర్ కేంద్రంగా ఇద్దరు డీసీపీ స్థాయి అధికారులు పనిచేయనున్నారు. మాదాపూర్ ఏసీపీ, డీసీపీ పరిధిలో ఇప్పటి వరకు కొనసాగిన నార్సింగి పోలీస్‌స్టేషన్ ఇకపై రాజేంద్రనగర్ డీసీపీ పరిధిలోకి రానుంది.

నార్సింగి కేంద్రంగా ఏసీపీ డివిజన్..

సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో నార్సింగి కేంద్రంగా కొత్తగా ఏసీపీ డివిజన్‌ను ఏర్పాటు చేశారు. ఎస్సై స్థాయి అధికారితో మొదలైన నార్సింగి పోలీస్‌స్టేషన్ ప్రస్థానం తర్వాత సీఐ స్థాయి అధికారికి మారింది. ప్రస్తుతం ఏకంగా ఏసీపీ స్థాయి అధికారికి కేంద్రంగా మారనుంది. డీసీపీ స్థాయి అధికారి సైతం ఇదే నియోజకవర్గ కేంద్రం రాజేంద్రనగర్‌లోనే ఉండనుండటంతో పర్యవేక్షణ మరింత పెరిగే అవకాశం ఉంది. నార్సింగి కేంద్రంగా ఇటీవల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సైతం ఏర్పాటయ్యింది. ఎస్‌ఓటీ డీసీపీ స్థాయి కార్యాలయం నార్సింగిలోనే కొనసాగుతుంది.

కొత్తగా మూడు స్టేషన్లు..

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్త పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. నార్సింగి ఏసీపీ డివిజన్ పరిధిలోనే రెండు స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. శంకర్‌పల్లి మండలం మోకిల, పటాన్‌చెరు మండలం కొల్లూరులో కొత్తగా పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేసి వాటిని నార్సింగి ఏసీపీ పరిధిలో చేర్చారు. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు ఔట్ పోస్టుగా కొనసాగిన అత్తాపూర్‌ను పూర్తి స్థాయి పోలీస్ స్టేషన్‌గా మార్చి రాజేంద్రనగర్ డివిజన్‌లో చేర్చారు. రాజేంద్రనగర్ ఏసీపీ పరిధిలో ఇప్పటి వరకు కొనసాగిన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌ను చేవెళ్ల ఏసీపీ డివిజన్‌లోకి మార్చారు. రాజేంద్రనగర్ ఏసీపీ పరిధిలో పాత రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లతో పాటు అత్తాపూర్ ఉంటాయి. ఇప్పటి వరకు నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న మేఘనాగడ్డ, జన్వాడ, మిర్జాగూడ కొత్తగా ఏర్పడుతున్న కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధికి మారనుండగా ఇంద్రానగర్‌కాలనీని కొల్లూరు స్టేషన్ పరిధిలోని మార్చారు.

అధికారులకు పూర్తి పట్టు..

కొత్తగా ఏర్పడిన నార్సింగి ఏసీపీ డివిజన్‌తో పాటు రాజేంద్రనగర్ డీసీపీ జోన్‌లకు ఆయా ప్రాంతాలపై పట్టున్న అధికారులను నియమించారు. గతంలో శంషాబాద్‌లో డీసీపీగా పనిచేసిన జగదీశ్వర్‌రెడ్డిని కొత్తగా ఏర్పడిన రాజేంద్రనగర్ జోన్ డీసీపీగా నియమించారు. నార్సింగి ఇన్‌స్పెక్టర్‌గా గతంలో ఎక్కువ కాలం పనిచేసిన జీవీ రమణగౌడ్‌కు పదోన్నతి రావటంతో తిరిగి ఆయననే నార్సింగి ఏసీపీగా నియమించారు. ఇద్దరూ అనుభవజ్ఞులైన అధికారులు కావడంతో రాబోయే రోజుల్లో పోలీసింగ్ పటిష్టంగా మారటంతో పాటు నేరాలు అదుపులో ఉంటాయని స్థానికులు భావిస్తున్నారు.

అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు కోరారు. ఈ మేరకు ఆదివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. యూనియన్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జి.కవిత, సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్, రాజేంద్రనగర్ మండల కన్వీనర్ గట్టయ్య, గండిపేట మండల యూనియన్ అధ్యక్షురాలు కె.సుధారాణి, కార్యదర్శి మీనాల ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరగనున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలపై మాట్లాడి బడ్జెట్ కేటాయింపులు పెంచేందుకు కృషి చేయాలని కోరారు. సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవచూపాలని ఎమ్మెల్యేను కోరామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించారని సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో జ్యోతి, సుకన్య, విజయరాణి, నీలావతి, ఇందిరారాణి, చంద్రకళ, మీనా, బాలలక్ష్మి, శ్రీలలిత, ప్రణిత,ప ఉషారాణి, సరిత, నిర్మల, సావిత్రి, మంజుల, ప్రసన్న, గంసమ్మ, లీలా, రాణి, శోభ, అన్నపూర్ణ, నలిని తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

రాజేంద్రనగర్: డీఎల్ఆర్ఎల్ డిఫెన్స్ ఎలక్ట్రానిక్ రీసెర్చ్ లైబ్రరీలో 42 ఏళ్లుగా సేవలందించిన నల్లింగ్ జగదీశ్వర్ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆదివారం అత్తాపూర్ డివిజన్ బీజేపీ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. దేశ సేవకు జగదీశ్వర్ జీవితాన్ని అంకితం చేశారని ఆయన శేష జీవితం సంతోషంగా సాగాలని చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాబాద విజయ్‌కుమార్, మూసి ప్రక్షాళన కమిటి కన్వీనర్ జయనంద్‌రెడ్డి, కిరణ్‌చారి, రావుల జగన్, సాయియాదవ్ పాల్గొన్నారు.



నల్లింగ్ జగదీశ్వర్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

రహదారులు 'తారు'మారు

- బీటీ తొలగించి మట్టి పోసి వదిలేసిన వైనం
- రోడ్ల విస్తరణలో తీవ్ర జాప్యం..
- పీఎంజీఎస్‌వై నిధుల పనులకు అడ్డంకులు
- వాహనదారుల అవస్థలు



పెద్దషాపూర్-జూకల్ మార్గంలో మట్టి రోడ్డును తలపిస్తున్న బీటీ రోడ్డు.

శంషాబాద్ రూరల్: శంషాబాద్ డివిజన్‌లో రహదారుల విస్తరణ.. కొత్త రోడ్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి.. ఈ కారణంగా తారు రోడ్లు కాస్తా మట్టిరోడ్లుగా మారిపోయాయి. సుమారు 18 నెలల క్రితం ప్రారంభమైన పనులు కేవలం మట్టి పనుల దగ్గరే నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే..మండల పరిధిలోని పలు రహదారుల అభివృద్ధికి ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ వాటిని సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించారు. సకాలంలో పనులు జరగకపోవడం.. బిల్లులు రాకపోవడంతో పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. కొన్ని చోట్ల భూసేకరణ సమస్య కూడా ఆలస్యానికి కారణమవుతోంది.

పెద్దషాపూర్-కాచారం మార్గంలో ..

పెద్దషాపూర్‌లోని బెంగళూరు జాతీయ రహదారి నుంచి కాచారం రోడ్డు విస్తరణ కోసం రూ.2,22,90,000 మంజూరయ్యాయి. జూకల్ శివారు వరకు 4.2 కి.మీటర్ల దూరం ఈ పనులు చేపట్టాల్సి ఉంది. ఈ మార్గంలో 4 కల్వర్టుల నిర్మాణం పూర్తి చేశారు. అక్కడక్కడ మట్టి పనులు చేపట్టారు. ఈ రోడ్డును 3.75 మీటర్ల నుంచి 5.5 మీటర్లకు విస్తరించనున్నారు.

పాల్మాకుల నుంచి రాయన్నగూడ చౌరస్తా వరకు

శంషాబాద్, కొత్తూరు మండలాల్లోని పలు గ్రామాలను కలుపుతూ పాల్మాకుల నుంచి పిల్లోనిగూడ, మక్తగూడ, ననాజీపూర్ మీదుగా షాబాద్ మార్గంలోని రాయన్నగూడ చౌరస్తా వరకు ఉన్న ఈ రోడ్డును విస్తరిస్తున్నారు. 5.3 కి.మీ. మేర రోడ్డు విస్తరణతో పాటు పిల్లోనిగూడ-మక్తగూడ గ్రామాల మధ్యలో ఎంటేరువాగుపై భారీ వంతెన నిర్మాణం చేపట్టారు. ఇందుకు గాను రూ.4 కోట్లు మంజూరయ్యాయి. అయితే ఈ మార్గంలో సైతం మక్తగూడ నుంచి రాయన్నగూడ చౌరస్తా వరకు అక్కడక్కడ మట్టి పనులు చేపట్టారు. వాగుపై వంతెన నిర్మాణ పనులు సైతం అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

ఘాంసిమియాగూడ- పీ.వన్ రోడ్డులో..

బెంగళూరు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఘాంసిమియాగూడ నుంచి పీ-వన్ రోడ్డు వరకు రోడ్డు అభివృద్ధికి రూ.2,82,50,000 నిధులు మంజూరు అయ్యాయి. సుమారు ఐదు కి.మీటర్లు మట్టి రోడ్డుగా ఉన్న ఈ మార్గాన్ని 5.5 మీటర్లకు విస్తరించడంతో పాటు తారు రోడ్డు వేయనున్నారు. ఈ రోడ్డుపై 6 కల్వర్టుల నిర్మాణం పూర్తి చేయగా.. మట్టి పనులు ఇంకా పూర్తి చేయాల్సి ఉంది.

పెద్దషాపూర్ నుంచి నర్కూడ వరకు..

చొదరిగూడ మీదుగా పెద్దషాపూర్ నుంచి నర్కూడ వరకు రోడ్డు పనులు చేపట్టారు. గతంలో చిన్నపాటి మట్టి రోడ్డు ఉండగా.. ఈ మార్గాన్ని 5.1 కిలో మీటర్లు మేర విస్తరించనున్నారు. ఇందుకుగాను రూ.3.56 కోట్లు మంజూరయ్యాయి. ఈ మార్గంలో 8 కల్వర్టుల నిర్మాణం పూర్తి చేయగా.. మట్టి పనులు నిలిచిపోయాయి. ఈ రోడ్డు పనులు పూర్తయితే మండలంలోని సమీప గ్రామాల ప్రజలు బెంగళూరు జాతీయ రహదారి నుంచి షాబాద్ రహదారికి చేరుకోవడానికి దూర భారం తగ్గుతుంది.

భూసేకరణలో ఇబ్బందులు..

పెద్దషాపూర్-నర్కూడ మార్గంలో రోడ్డు విస్తరణకు భూసేకరణ సమస్యగా మారింది. ఇక్కడ గతంలో చిన్నపాటి మట్టి రోడ్డు ఉండగా.. సర్వే చేపట్టిన తర్వాత పనులు చేయకుండా.. కాంట్రాక్టరు కల్వర్టుల నిర్మాణం పూర్తి చేశాడు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న రైతులు రోడ్డు విస్తరణ కోసం సేకరించే భూమి హద్దుల వద్ద పేచీ పెడుతున్నారు. పలుసార్లు సర్వే చేసినా ఓ కొలిక్కి రాలేదు. ఘాంసిమియాగూడ మార్గంలో కూడా ఇలాంటి సమస్యలే ఎదురవుతున్నాయి.

పనులు జరగడంలేదు..



రోడ్లు అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసి రెండేళ్లు అవుతుంది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు జరగడంలేదు. బీటీ రోడ్లు తవ్వి వదిలేశారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

–చెక్కల ఎల్లయ్య, ఎంపీటీసీ సభ్యుడు, పెద్దషాపూర్

త్వరలో పూర్తయ్యేలా చూస్తాం..

పీఎంజీఎస్‌వై నిధులతో చేపట్టిన రోడ్డు పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తాం. ఆయా మార్గాల్లో మట్టి పనులు జరుగుతున్నాయి. కొన్ని చోట్ల భూసేకరణ సమస్య నెలకొంది. రోడ్డు విస్తరణ కోసం మరోసారి సర్వే చేసి తగు విధంగా డిజైన్‌లో మార్పులతో ఎస్టిమేషన్ పంపించాం.

–అనూష, ఏఈఈ, పంచాయతీరాజ్



ననజాపూర్ వద్ద రోడ్డు విస్తరణ పనులు ఇలా..



పిల్లోనిగూడ వద్ద నిలిచిన వంతెన పనులు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో తెలంగాణ బీసీ సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వి.చంద్రశేఖర్‌గౌడ్

రాజేంద్రనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను అర్హులందరికీ అందేలా చూడాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. తెలంగాణ బీసీ సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన వి.చంద్రశేఖర్‌గౌడ్ ఆదివారం ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ బీసీలను చైతన్యం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షులు సురేష్ గౌడ్, నార్సింగి మార్కెట్ కమిటి డైరెక్టర్ రాజు, కోఆప్షన్ సభ్యులు వెంకటేష్, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆసీఫ్, తెలంగాణ బీసీ సమితి రాజేంద్రనగర్ మండల అధ్యక్షుడు జయప్రకాష్‌చారి పాల్గొన్నారు.

ఫ్లైఓవర్‌ను పొడిగించేవరకు ఉద్యమం



ఫ్లైఓవర్‌ను పొడిగించాలని డిమాండ్ చేస్తున్న శంషాబాద్ జేఏసీ నేతలు

శంషాబాద్: బ్రిడ్జీ బడావో.. శంషాబాద్ బచావో నినాదంతో ఫ్లైఓవర్‌ను సిద్ధాంతి నుంచి సింప్లెక్స్ దాకా పొడిగించే వరకు ఐక్యంగా ఉద్యమిస్తామని శంషాబాద్ జేఏసీ నేతలు అన్నారు. ప్రస్తుతం పట్టణంలో కొనసాగుతున్న ఫ్లైఓవర్ డిజైన్‌తో పట్టణ ప్రజలు తీవ్రంగా నష్టపోతారన్నారు. ప్రస్తుతం ప్యారడైజ్ హోటల్ నుంచి సిద్ధాంతి వరకు చేపడుతున్న ఫ్లై ఓవర్‌ను సింప్లెక్స్ వరకు పెంచాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల అభిప్రాయం స్వీకరించకుండానే నేషనల్ హైవే అథారిటీ ఫ్లైఓవర్‌ను సిద్ధాంతి వరకు మాత్రమే చేపట్టడంతో ట్రాఫిక్ రద్దీ పెరిగి సిద్ధాంతి నుంచి పాత శంషాబాద్‌కు ప్రస్తుతం ఉన్న అనుసంధానం కోల్పోతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ అన్నారు. బ్రిడ్జీ నిర్మాణం సింప్లెక్స్ వరకు పొడిగించేందుకు జేఏసీతో కలిసి ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ విషయమై మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. బ్రిడ్జీ నిర్మాణంతో పట్టణంలోని రెండు ప్రాంతాల అనుసంధానం కోల్పోవడంతో జీవనాధారం కూడా దెబ్బతింటుందని మాజీ సర్పంచ్ గణేష్‌గుప్తా అన్నారు. బ్రిడ్జీని సింప్లెక్స్ వరకు పెంచే పోరాటానికి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ డి. వెంకటేష్‌గౌడ్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్, ఇతర వార్డుల కౌన్సిలర్లు జహంగీర్‌ఖాన్, అశోక్, వై. కుమార్, అమృత, మస్రత్, నాజియా, టీఆర్ఎస్ నాయకులు మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, తాజ్‌బాబా, అంజద్, కాంగ్రెస్ నాయకులు, సిద్ధాంతి బస్తీవాసులు పాల్గొన్నారు.

విజ్ఞాన ప్రదర్శనలతో మేధో వికాసం





పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో సైన్స్ ఫెస్ట్‌ను పరిశీలిస్తున్న ఉమా మహేశ్వరిరెడ్డి తదితరులు


రాజేంద్రనగర్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు సైన్స్ ఫెస్ట్‌లు దోహదపడతాయని జనహిత వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకురాలు, బీజేపీ మహిళా నాయకురాలు ఉమా మహేశ్వరిరెడ్డి అన్నారు. ఆదివారం అత్తాపూర్‌లోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో సైన్స్ ఫెస్ట్-23 నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె విద్యార్థులు రూపొందించిన నమూనాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నా రు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు లక్షల మంది విద్యార్థులతో సేవా కార్యక్రమాలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చామర్తి ఉమామహేశ్వర్‌రావు

బండ్లగూడ: రెండు లక్షల మందికి పైగా ఉన్న సరస్వతీ శిశుమందిరాల పూర్వ విద్యార్థులను సామాజిక సేవలో పాల్గొనేలా క్రియాశీలకంగా తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర అధ్యక్షులు, చామర్తి ఉమామహేశ్వర్‌రావు అన్నారు. సరస్వతీ విద్యాపీఠం స్వర్ణోత్సవాల్లో భాగంగా బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని శారదా ధామంలో పూర్వ విద్యార్థి పరిషత్ రాష్ట్రస్థాయి మహాసమ్మేళనానికి మణిపాల్ యూనివర్సిటీ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ తిరుమలరావు ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చామర్తి ఉమామహేశ్వర్‌రావు మాట్లాడుతూ బలహీనపడుతున్న సాంస్కృతిక సంపదను పటిష్టం చేసేందుకు సరస్వతీ శిశుమందిరాల పూర్వ విద్యార్థులు కృషి చేయాలన్నారు. నేటి విద్యార్థుల్లో జాతీయ దృష్టి కోణం మెరుగుపడాలని ఆకాంక్షించారు. ఏ స్థాయికి ఎదిగినా మన మూలాలను మరిచిపోకూడదన్నారు. విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా మంత్రి లింగం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సరస్వతీ శిశుమందిరాల పూర్వ విద్యార్థులు అన్ని రంగాల్లోనూ ప్రముఖ స్థానాల్లో ఉన్నారన్నారు. శిశుమందిరాల్లో సంస్కారంతో కూడిన విద్యను అందిస్తున్నామని, ఆ సంస్కారమే జాతీయ భావనకు పునాది అన్నారు. ఏ స్కూల్‌లో ఎక్కువ ఫీజు కడితే పిల్లలకు చదువు అంత బాగా వస్తుందన్న భావనలో ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లల పెంపకంలో తమ వంతుగా ఏం చేయాలన్న బాధ్యతను మరిచిపోతున్నారన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు విద్యారంగం బాగా నష్టపోయిందని, ఇకనైనా విద్యా విధానాన్ని గాడిలో పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. శిశుమందిరాల అభివృద్ధిని సహించలేని కొందరు ఇక్కడి బోధనపై విషప్రచారం చేస్తున్నారని అలాంటి ప్రయత్నాలను తిప్పికొట్టాల్సిన బాధ్యత పూర్వ విద్యార్థులపై ఉందన్నారు. రాబోయే రెండేళ్లలో దేశం అత్యంత గడ్డు పరిస్థితిని కార్యక్రమంలో రావుల గిరిధర్, కిరణ్మయి, బొడ్డు శ్రీనివాస్, పతకమూరి శ్రీనివాసరావు, కుల్లూరు విద్యాన్‌రెడ్డి, రావుల సూర్యనారాయణ, మురళీమనోహర్, హరిస్మరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, పూర్వ విద్యార్థులు

కరాటేతో ఆత్మరక్షణ



కరాటే శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: చిన్నతనం నుంచే పిల్లలను చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని కరాటే కోచ్ ఎస్.శ్రీనివాస్ అన్నారు. అత్తాపూర్‌లో నిర్వహించిన కరాటే పోటీల్లో విద్యార్థులు శాన్వి, గునీత్, యోగేశ్, గోవింద్‌రాజ్, విష్ణుప్రియ, అక్షితలు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వారికి సినీ హీరో ఇంద్రసేన చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో ఆత్మ రక్షణతో పాటు ఆరోగ్యానికి, జ్ఞాపకశక్తి పెరిగేందుకు కరాటే శిక్షణ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మాస్టర్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.